ముక్తిక్కించే మందహాసం

తులసి ఇంట్లోకి ధూకుడుగా వస్తుంటే- "ఏమోయ్. ఇవాళయినా మనకు పనిమనిషి దొరుకుతుందా? బట్టలుతుకుతుంటే చేతులు గురిజేస్తున్నాయి. గిన్నెలు తోముతుంటే చేతులు మంటలెక్కుతున్నాయి" ఎంతో బాధ పడుతున్నట్టు ముఖం పెట్టింది నందిని.

"చూడు నందినీ, నా పని మరీ అధ్వాన్నంగా ఉంది. రాత్రి ఒళ్ళునొప్పులతో నిద్రపట్టలేదంటే నమ్ము. తెల్లవారి లేవలేకపోయాను. ఆయనకు నన్ను చూస్తే ఒకటే నవ్వు. 'ఎంత సుకుమారివ'ని ఒకటే ఆక్షేపిస్తున్నారు. మరి ఈ మధ్య అలవాటు తప్పిపోయింది కదా. అంట్లుతోమటం బట్టలుతకటం ఎప్పుడూ చేయ లేదనుకో. చిల్లర పనులే కావలసినన్ని కుంగదీస్తుంటే ఈ పనులు కూడా చేయ మంటే సాధ్యమా?" తులసి కంటె నందిని బాగా అలిసిపోయినట్టు కనబడినా గడగడా మాట్లాడింది తులసి

"ఏం చేద్దాం" అనుకుంటూ ఇద్దరూ చిన్నబోయిన ముఖాలతో నిలబడ్డారు.

"నందినీ మనకిక్కడ పనిమనుష్యులు దొరకటం చాలా కష్టం. ఈ శ్రీమంతుల లోకాలిటీకి సామాన్యులు రారు. ఎవరయినా కంటికి కనబడితే సౌకర్యం కోసం వాకబు చెయ్యవచ్చు. మనం ఆ ఎదురుగా ఉన్న కాలనీకి వెళ్ళితే ఏ ఇల్లాలి నడిగినా ఒక మనిషిని పంపే అవకాశం ఉంది. కాని. తెలియని వాళ్ళ యింటికి వెళ్ళటం చాలా కష్టం" తులసి ముక్కు చిట్లించింది.

"ఇదివరకూ ప్రభుత్వం ఒక్కొక్క ఆఫీసరుకు ఇద్దరూ ముగ్గురూ జవాన్లను ఇచ్చేది. ఇస్తే ఒకరిని వంట వాడికింద వేసుకున్నా, మిగతా ఇద్దర్నీ ఇంటిపనుల కింద ఉపయోగించుకునే వాళ్ళం ఇంటికి జవాన్లను ఇవ్వటమే మానేసింది ప్రభుత్వం. ఇది అన్నివిధాలా ఇబ్బందిగా ఉంది"

"మనకు స్వాతంత్ర్యం వచ్చింతరువాత నానాటికి తీసికట్టుగా ఉంది వ్యవహారం.

ఇద్దరూ మాట్లాడడానికేమీ లేదన్నట్టుగా మౌనంగా ఉండిపోయారు. వాళ్ల ముఖాల మీద అంతులేని దిగులు పేరుకుపోయి ఉంది. బిక్క ముఖాలు పడ్డాయి ఇద్దరికీ వారం రోజుల నుండీ వాళ్ళిద్దరికీ ఇంట్లో పాచిపని చేసే నౌకర్లు లేరు. అంతా గచ్చుచేసిన వారికి పెరడూ కనుక తెల్లవారక ముందే రబ్బరు ట్యూబుతో కడిగినట్టు నీళ్లు చల్లేస్తున్నారు. వాకిట్లో ముగ్గులు వెయ్యక్కర్లేదు. సిమెంటు మీద రంగులతో రంగవల్లులు తీర్చిదిద్ది ఉన్నాయి. ఇద్దరూ నీళ్ళగదుల్లో సబ్బుపొడి తీసుకుని స్టీలు గిన్నెలే కనుక కడిగేసుకుంటున్నారు. స్నానాలు కాగానే సర్ఫులో బట్టలు నానబెట్టుకుని ఉతికి అరవేసుకుంటున్నారు.

ఇలా ఒకటి....రెండూ....మూడూ....వారం గడిచింది.

అరక దున్నే రోజులు. విత్తనం చల్లి వస్తామని పనిచేసే ఆడ నౌకర్లు ఊళ్లకు వెళ్లారు కుటుంబాలతో సహా.

కొన్ని ఇళ్లల్లో నౌకర్లు లేకపోయినా దినకృత్యాలు చాలా సులువుగా జరిగి పోతున్నాయి కొన్ని చోట్ల అదొక సమస్యగా లేదు. కాని–అన్నిటికీ నౌకర్ల మీద ఆధారపడే నందినీ తులసీల వంటి వాళ్లకు దినదిన గండంగా ఉంది.

నందినీ తులసీల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇళ్ల మధ్యగా ఎప్పుడు బడితే అప్పుడు ఆ గోడల దగ్గర నిలబడి మాట్లాడుకుంటూ ఉంటారు గంటల కొద్దీ.

ఆ రోజు గేట్లకు దగ్గరగా నిలబడి ప్రహారి గోడను ఆనుకుని పనిచేసిన శ్రమంతా పోయేటట్టుగా ఎక్కడెక్కడివో ఎప్పటెప్పటివో కబుర్లు నవ్వుకుంటూ చెప్పుకుంటున్నారు.

"అమ్మా ఓ ముద్ద అన్నం వెయ్యమ్మా ఆకలికి చస్తుండా నిన్నటేలనుంచీ"

అరువు వినబడుతున్నా అది వాళ్ళ సంభాషణకేమీ ఆటంకంగా లేదు.

అతడు మళ్ళీ మళ్ళీ పిలిచాడు.

తులసికంటె నందినికి చికాకెక్కువ తన మాట కేవరయినా అడ్డం వస్తే గుర్రెర్ర చేస్తుంది.

"ఛీ ఎవరు నీవు? అలా అరుస్తావేం? ఏదిలేకపోయినా మనకు బిచ్చగాళ్ళకు కొదువలేదు."

అతడొక చెక్కపీట మీద కూర్చున్నాడు. ఆ చెక్కకు నాలుగు చిన్నచిన్న చక్రాలున్నాయి. అతడు నేలమీద చేతులానించి బండిని ముందుకు జరుపుకుంటున్నాడు.

ఆశ్చర్యంతో నందిని "చూడు తలసీ" అన్నట్టు కళ్ళతో చూపించింది.

ఇద్దరూ గేటుమీదుగా ఒంగి అతడిని చూస్తున్నారు.

అతడికి పాతికేళ్ల మీద ఒకటి రెండేళ్లు ఉంటాయేమో. తల వెంట్రుకలు రింగులు రింగులుగా తిరిగి పైకి లేచినట్లున్నాయి. రంగు-నలుపే-కాని అది కారు నలుపు కాదు. తారు నలుపు. నిగ నిగ మెరుస్తున్నది. నిండుగా ఉన్న ఆ ముఖంలో తెల్ల తామరపువ్వుల్లా తేజస్సు నింపుకొని వెలిగిపోతున్నాయా కళ్లు ముక్కు కొన ఒంపు తిరిగి పై పెదవి మధ్యగా ఉన్న గుంటను స్పుటంగా కనబరుస్తోంది. ఆ పెదవులు బలిష్టంగా ఉన్నా అదొకమాదిరి అందంగా మొగ్గలా ముడుచుకున్నాయి. అతడు మాట్లాడేటప్పుడు గుండ్రటి ఆ తారు నలుపు ముఖంలో- ఆ నల్లటి పెదవుల మధ్య తెల్లటి పలువరుస కనబడీ కనబడకుండా తళుక్ తళుక్ మంటున్నది. ఆ పలువరుస చూడటం కోసం అతడొకసారి నోరు విప్పితే బాగుండుననిపిస్తుంది ఎవరికయినా.

అతడి ఒంటిమీద గోచీతప్ప మరొకటిలేదు. దేహం బలిష్టమైన కండరాలతో మెలిదిరిగినట్లుంది.

అతడికేసి ఎగాదిగా చూస్తున్నారు నందినీ తులసీ.

తనకేసి వాళ్లిద్దరూ అలా చూస్తుంటే అతడికి ఆశ కలిగింది- అడిగితే ఏదయినా పెడతారని.

"అమ్మా గుప్పెడు మెతుకులుంటే వెయ్యండమ్మా" అంటూ కడుపుమీద కొట్టుకుని చూపించాడు అతడు. వాళ్ళకు జాలి కలిగేటట్టుగా చేతులు పైకెత్తి దణ్ణం పెట్టాడు.

"అబ్బి చూడు. ఇది భోజనాల వేళ కాదు అన్నం పెట్టటానికి" అన్నది తులసి కాస్త కఠినంగా

"అబ్బి చూడు. మా రెండిళ్ళల్లో నౌకర్లులేదు. ఊళ్ళకు వెళ్ళారు. నీవేమయినా పనిచేసి పెట్టగలవా? చేస్తే అన్నం వండి అయినా పెడతాను" అన్నది నందిని.

"ఇద్దరు తల్లులూ నన్ను చూస్తుండారుగా! లేచి నిలబడిలేను. నడవలేను. కాళ్ళుపడిపోయ్యాయి. ఏదో రోగం అన్నారు. మందేసుకోటానికి డబ్బులులేవు. ఒక అయ్యను కాళ్ళు పట్టుకొంటే ఈ చెక్కకు చక్రాలు పెట్టి ఇచ్చాడు. ముష్టి ఎత్తుకుని తినటమే నా బ్రతుకు, రోజుకో ఊరి." నుదురు కొట్టుకున్నాడు.

"పని చెయ్యలేని వాడికి అన్నం ఎలా పెట్టమంటావు చెప్పు? కష్టం చెయ్యి- తిను" తల ఎగరవేస్తూ అన్నది నందిని. అంతటితో ఊరుకోకుండా మా పన్లు మేము చేసుకోలేక నానా యాతన పడుతున్నామని చెప్పాగా?" అన్నది కొంచెం చికాకుగా ముఖం పెట్టి.

"మా తల్లులకు దణ్ణం పెడతా. నన్నుచూసి పని చెప్పండి" తలకు దోపిలి కట్టాడు.

"నీ పేరేమిటి?" అడిగింది తులసి.

"నా పేరా?" నవ్వాడతడు.

అతడి ముఖం వంకే చూస్తున్నారిద్దరూ.

"నా పేరు సుబ్బడండి"

"రా లోపలికి! ముందు అన్నం తిను. తరువాత నీకు చేతనైనంత పని చెయ్యి" గేటు తెరిచి దారి చూపించింది తులసి.

సుబ్బడు నేలకు చేతులానించి బండి నెట్టుకుంటూ వెళ్ళాడు.

తులసి విస్తరాకులో అన్నపెట్టి పచ్చడివేసింది. నందిని కూర పులుసు తెచ్చిపెట్టింది. ఆ కిందటిరోజు రసగుల్లా తెచ్చుకున్న ముంత ఖాళీ అయితే దాన్ని కడిగి మంచినీళ్ళు పోసి యిచ్చింది.

సుబ్బడు అవురావురుమంటూ అన్నం కలుపుకుని తింటూ ఉంటే ఇద్దరూ అతడినే చూస్తున్నారు. వాళ్ళిద్దరికీ ఆ లొకాలిటీలో ఆ మధ్య జరిగిన దొంగతనాలను గురించి జ్ఞాపకం వచ్చి ఒళ్ళు జలదరించినట్లయింది. భయం కొద్దీ ఒణుకు పుట్టింది.

ఇంట్లోచేరి దొంగతనం చెయ్యడు కదా?

ఇద్దరికీ అంతలో కళ్ళు పెద్దవయ్యాయి. రెండు చేతులూ గుండెలకు చేర్చుకున్నారు.

మళ్ళీ అంతలోకే ధైర్యం వచ్చింది రెండిళ్ళల్లోనూ టెలిఫోన్లు ఉన్నాయి. అతడేమయినా అనుచితంగా ప్రవర్తిస్తే పోలీసుస్టేషన్‌కు వెంటనే ఫోను చేయవచ్చు కదా అనుకున్నారు. మనసులు తేలికపడ్డట్టయి అమ్మయ్య అనుకున్నారు.

అతడు భోజనం చేశాడు. ముంతెడు నీళ్ళు తాగాడు. ఆకలి తీరిన సంతృప్తి ముఖంలో కనబడుతున్నది. విస్తరి మడిచి ఒక చేత్తో పట్టుకుని మరొక చేయి నేలకానించి చెక్క జరుపుకుంటూ బైటికి వెళ్ళి, చెత్తకుండీలోకి విస్తరి విసిరివేశాడు. లోపలికి వచ్చి తాను తిన్నచోట నీళ్ళు చల్లాడు.

"అన్నమయితే తిన్నావు. ఇంక పనిచేస్తావా?" అడిగింది నందిని- కొద్దిగా హేళన ధ్వనించేటట్టుగా.

తల ఊపాడు సుబ్బడు.

తులసి లోపలికి వెళ్ళి టబ్బునిండా అంట్ల గిన్నెలు తెచ్చి పంపు దగ్గర పెట్టింది సీకాయానబ్బు పొడీ కలిపి పళ్ళెంలో వేసి ఇచ్చింది

పీచు సబ్బుపొడిలో అద్దుకొని సుబ్బన్న గిన్నెలు తోముతుంటే నందినీ తులసీ ఎదురుగుండా గట్టుమీద కూర్చుని చూస్తున్నారు.

"సుబ్బన్నా! నీవేం పనిచేసే వాడివి? నీదీఊరేనా?" అడిగింది నందిని.

"మేము ఈతపేళ్ళతో బుట్టలల్లుకునే ఓళ్ళం, ఒక లారీనిండా ఈతపేళ్ళేసుకుని ఏ పట్నమయినా పదిమందిమి పెళ్లాం బిడ్డలతోపోతే-పదిరోజుల్లో ఆ పేళ్ళతో బుట్టలల్లి ఆ ఊళ్ళోనే అమ్ముకుని తిరిగివచ్చే ఓళ్ళం. పిల్లలు- పెద్దలు- ఆడా- మగా- అందరం అన్నిరకాల బుట్టలల్లుతమ్" తలపైకెత్తి కళ్ళు మూసుకున్నాడు. ఏదో బాధ మనసులో మెదిలినట్లుగా.

"అందుకే గిన్నెలు తోమటం నీకు కొత్తగా ఉంది" అన్నది తులసి.

"ఎట్లనో బతకాలి గదమ్మా" నొక్కిపెట్టి పీచుతో రుద్దుతున్నాడు సుబ్బన్న.

"ఆ బుట్టలపని ఎందుకు మానేశావు ? చేతిలో పనిపెట్టుకుని తిండికిలేదని బాధపడుతున్నా వెందుకు ?" నందిని ప్రశ్నించింది.

బరువుగా నిట్టూర్చాడతడు.

"గుంపులో ఉన్న ఆడా మగా మధ్య తగవులాట లొచ్చినయ్. కాళ్లూ చేతులూ పట్టుకుని నానోట్లో ఏదో పోశారు. తెల్లారి నాకీ గతి పట్టింది. గుంపులో నుంచి తోసినరు. దిక్కులేక గడ్డ బండిలో కూర్చుని ఈ ఊరు చేరిన" తలవంచుకుని గిన్నెలన్నీ కడిగి టబ్బులో పెట్టాడు.

"నీకు పెళ్ళయిందా ?" నందిని అడుగుదామని నోరు తెరవబోయే లోపల తులసి ఆడగనే అడిగింది.

"అయింది తల్లీ, మాయమ్మ నాకు పెళ్ళికాదేమోనని చిన్నప్పుడే ఒక పోలేరమ్మతో చేసింది."

"అంటే- నీ భార్య పేరా అది ?"

"కాదమ్మా. దాని పేరు రంగి కాని దాని ఎదటబడి ఎవరూ బతకలేరు. అది పోలేరమ్మ అంతది."

నందినీ తులసీ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"అయితే వెళ్ళిపోయిందా ?"

"నన్నే ఎళ్ళగొట్టింది."

అతడు చెప్పినదంతా నిజమేననిపించింది వాళ్లకు. దిగువ తరగతుల్లో విడి పోవటానికి చాలా స్వేచ్ఛ కనబడుతుంది. కొందరు ఆడవాళ్లు మగవాళ్లను చాలా ఏడిపిస్తారు. ఇతడు కొంచెం మెత్తటివాడేమో? ఏడిపిస్తోందనిపించింది.

టబ్బులో ఉన్న గిన్నెలన్నీ తులసి లోపల పెట్టుకుని సబ్బులో నానబెట్టిన బట్టలన్నీ తెచ్చి పడేసింది. అతడు వాటిని ఉదికి పిండిపెట్టాడు.

అట్లాగే అతడు జరుగుతూ లోపలికి వెళ్లి ఇల్లు ఊడ్చాడు. ట్యూబుతో చెట్లకు నీళ్లు పట్టాడు.

ఇక్కడ పని కాగానే నందిని ఇంటికి వెళ్లి పనులన్నీ చేశాడు. ఆ రాత్రి భోజనం నందిని ఇంట్లో చేశాడు. తులసి ఇంట్లో గరాజిలో ఒక మూలకు ఆమె ఇచ్చిన గోనె సంచిమీద పడుకుని తెల్లవార్చేడు.

నందినీ తులసీ అతడి పనికి మురిసిపోయారు. బట్టలు బాగా ఉదికాడు. గిన్నెలు మెరిసేటట్లు తోమాడు. ఇల్లు చక్కగా ఊడ్చాడు. ఆడ నౌకర్లకంటె ఓపికతో పని బాగా చేశాడని మెచ్చుతున్నారు.

సుబ్బన్న తెల్లవారకుండానే వాకిలి ఊడ్చి నీళ్లు చల్లేవాడు. వాళ్లు నిద్రలేవకముందే చెట్లకు నీళ్లు పట్టేవాడు.

పనిచేస్తున్నంతసేపూ సుబ్బన్నను మాటల్లో పెట్టి నవ్విస్తూ ఉండేది నందిని.

"సుబ్బన్నా. మొన్న మామిడిచెట్టు కింద పడుకుని ఏదో పాటలు పాడావు. సినెమా పాటలు వచ్చా నీకు? నీ గొంతు బాగుంది. సినెమాల్లో చేరకూడదూ? డబ్బు బాగా వస్తుంది."

విచారంతో కుంగిపోయిన అతడి మనసు మూలిగినా ఆమె మాటలకు అతడి ముఖమ్మీద మందహాసం రేఖామాత్రంగా పొడచూపింది.

అది చాలా విచిత్రంగా తోచింది నందినికి.

మళ్లీ మళ్లీ ఆ విచిత్రమయిన మందహాసం అతడి ముఖంలో చూడాలని ఆమె ఆశించేది.

ఆమె చిత్రకారిణి. అతడు నవ్వినప్పుడు- అతడు మందహాసం చేసినప్పుడు- అతడి ముఖం గంభీరంగా ఉన్నప్పుడు- ఆమెకు తన చిత్రాలలో నిబిడీకృతం చేయ దలచినదేదో ఎదురుగా సాక్షాత్కరించినట్లుండేది.

ఒకనాడతడు అరటిచెట్ల దగ్గర ఉన్న పంపుదగ్గర బట్టలుతుకుతుండగా నందిని చూసింది. ఆమె, గది కిటికీ దగ్గరగా కుర్చీలో కూర్చుని కుట్టుకుంటున్నది. అతడు ఏదో ఆలోచిస్తూ- మధ్యమధ్య ఆకాశం వైపు చూస్తున్నాడు. నవ్వుకుంటు న్నాడు. అంతలోనే నిరాశలాంటిదేదో ముఖమంతా ఆవరించుకున్నట్టుగా ముఖం చిన్నబోతున్నది. మరుక్షణంలో కళ్లు మెరిసేటట్టు చూస్తున్నాడు.

నందిని ఆ దృశ్యంలోని దీప్తులను భద్రం చేసుకున్నది. విచిత్రంగా కనబడు తున్న అతడి ముఖకవళికలు ఆమె కుంచెలో ఇరుక్కున్నాయి.

ఆమె అతడిని ఆ కిటికీలోంచి చూస్తూ వివిధ భంగిమల్లో చిత్రించింది. ప్రతిరోజూ వాటికి మెరుగులు దిద్దుతున్నది. ఇంకా ఏదో ఒకభావం తాను చిత్రించ లేక పోయాననుకుని బాధ పడుతుంది.

సుబ్బన్నకు ఒంటినిండా బట్టా కడుపునిండా భోజనం అమరేసరికి ముఖం మరింత నవనవలాడుతూ మెరిసిపోతోంది. నిండుగా కనబడుతోంది. కాని అతడి ఆ మందహాసం- ఆ భ్రూకుటి- చికిలించిచూసే ఆ కళ్లలోని దీప్తి- నిమిషాల మీద మారుతున్నట్టు కనబడే ఆ భావప్రకటన- అవిటితనంలోకూడా కుంచించుకుపోని పౌరుషోచితమైన ఆ గాంభీర్యమూ తను చిత్రించగలిగిందా?

ఇంకా ఏదో వెలితిగా అసంపూర్తిగా ఉన్నాయి తన చిత్రాలు.

నందినికి మరొక సమస్య. అతడి మనసులో ఏముంది? ఎప్పుడూ ఎందు కట్లా ఆలోచిస్తూ ఉంటాడు? ఎందుకా నిర్లిప్తత? అతడేం పోగొట్టుకున్నాడు? అతడికేం కావాలి?

ఒకనాడు అతడు గిన్నెలు తోమేటప్పుడు పిలిచింది. అతడు తలఎత్తి చూశాడు.

"సుబ్బన్నా. నీకు పిల్లలున్నారా?"

అతడు తెల్లముఖం వేశాడు.

"చెప్పవేం?"

"ఏం చెప్పమంటారు తల్లీ?"

"అదే ఉన్నారా లేరా అని."

ఆ మాటకు అతడెట్లా జవాబు చెప్తాడు? అప్పుడు అతడి ముఖం ఎలా ఉంటుంది? అది చూడాలని ఆమె తపన.

"లేరు." తల వంచుకున్నాడు.

"పోనీ ఆ పోలేరమ్మను వదలిపెట్టి ఇంకో అమ్మాయిని చేసుకుంటావా?"

విషాదంలో మునిగితేలే ఒక వింత హాసరేఖ అతడి ముఖమంతా అలుముకుపోయింది. కళ్ళెత్తి ఆమె ముఖంలోకి చూశాడు

ఆ కళ్ళల్లో అదే నిర్లిప్తత.

పెదవుల మీద అదే విచిత్రమయిన మందహాసం.

నందిని మళ్లీ ఆలోచనలో పడిపోయింది.

తులసికీ నందినికీ ఇప్పుడు ఇంటి పనులను గురించిన చింతలేదు. అవి చాలా క్రమంగా జరిగిపోతున్నాయి. ఇంతవరకూ అతడికి భోజనం పెడుతున్నారు. చెరిఒక జతా బట్టలు ఇచ్చారు. కాని- జీతం ఇంత అని మాట్లాడుకోలేదు.

ఏమిటీ మినిషి? జీతం కావాలని అడగడేం?

డబ్బక్కర్లేదా?

నెల కాగానే "జీతమెంత కావాలోయ్" అడిగింది తులసి.

"కడుపునిండా తింటా ఉన్నా. ఒంటినిండా బట్టలేసుకుంటా ఉన్నా. తొంగోటానికి కూసింతచోటు చూయించినరు. ఇంకేం కావాల తల్లీ?" ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"అయితే మాత్రం? జీతం వద్దా? నీ కష్టం మాకెందుకు?"

విషాదంగా నవ్వాడు సుబ్బన్న

నోటితో అడగకపోయినా వాళ్ళే ఇస్తారనుకుంటున్నాడేమో ననుకుంది. తులసి.

నందినీ తులసీ ఒకరినొకరు సంప్రదించుకుని నెలకు ఇరవైవంతున అతడి. చేతిలో పెట్టబోయారు

''మీ తాన ఉంచండి తల్లులూ'' అన్నాడు ముఖం పక్కకు తిప్పుకుని.

తులసి పెనిమిటి నరసింహం ''ఈ కుంటివాడికింత జీతమెందుకని'' మూతి మూడు వంకర్లు తిప్పాడు.

''ఇంటి నౌకర్లు దొరకటం కష్టంగా ఉంది. కుంటి అయినా పనులన్నీ వేళకు జరిగిపోతున్నాయి. రేపటికి పనిమనిషి రాదేమోనన్న బెంగ అక్కర్లేదు'' సమర్ధించింది తులసి.

ఇప్పుడు తులసీ నందినీ కూడా నౌకర్లు లేక బాధపడిన ఆ వారంలోజులనూ సూలువుగా మరచిపోయారు. సుబ్బన్న కూర్చుని చేసేపనులు ఇంకా ఇంకా ఎక్కువగా చేస్తున్నాడు. ఆ యింట్లో ఈ ఇంట్లో కూరలు తరగటం, బూట్లు పాలిష్ చేయటం, కుర్చీలూ బల్లలూ తుడవటం మొదలుపెట్టాడు.

శుక్రవారంన్నాడు తలంటి పోసుకోవటం కోసం తులసి తొందరగా లేచింది. సుబ్బన్న ఇంకా పెరడూ వీధివాకిలి ఊడ్చినట్టు లేదనుకుంటూ తలుపులు తీసి చూసింది. సుబ్బన్న ఊడ్చిన జాడ కనబడలేదు. ''సుబ్బన్నా సుబ్బన్నా'' అనుకుంటూ గరాజిలోకి తొంగి చూసింది. ఇంటి వెనకకు వెళ్ళి చూసింది

జామచెట్టు పక్కకు మూటకట్టినట్టు పడి ఉన్నాడు సుబ్బడు. ఒంటినిండా గాయాలు తగిలినట్లున్నాయి. కళ్ళు మూసుకుని మూలుగుతున్నాడు.

''ఏం సుబ్బన్నా? ఏమయింది?'' తులసి ఆదుర్దాగా ప్రశ్నించింది.

నోటివెంట రక్తం కారినట్టుంది పెదవుల దగ్గర చారికలు కట్టాయి. పెదవులు కదలించలేకపోతున్నాడు. చెయ్యి కష్టమ్మీద కదలించి గోడవైపు చూపించా .

డ్రైనేజి గొట్టం జాయింటునుండి విడిపోయినట్టుంది. వేలాడుతున్నది.

వెంటనే లోపలికి వెళ్ళి నరసింహాన్ని పిలుచుకువచ్చి చూపించింది. అతడు నందిని భర్త విఠల్‌ను తీసుకు వచ్చాడు.

డ్రైనేజి గొట్టం పట్టుకుని పాకుతూ ఎవరోగాని పైకి వెళ్ళటానికి ప్రయత్నం చేశారని వాళ్ళకందరికీ అర్థమయింది.

"సుబ్బన్నా, నీవు పైకి ఎక్కాలని చూశావా ?" మగవాళ్ళిద్దరూ ఆతడిని అదిరించి బెదిరిస్తున్నారు.

అతడు లేదని తల ఊపుతూ ఒంటినిండా తగిలిన గాయాలను చూపించాడు.

పడ్డందువల్ల తగిలిన గాయాలని వాళ్ళు అనుమానించి పోలీసు రిపోర్టు చేశారు.

పోలీసులు వచ్చేలోగా తులసి కాఫీ చేసింది. నందిని సుబ్బన్న తెరచిన గొంతులో వేడివేడి కాఫీ పోసింది. పోలీసులు వచ్చేసరికి ఎనిమిది గంటలు దాటింది. అతడు ఈ లోపల కొంత తేరుకున్నాడు.

పోలీసులు అడిగిన ప్రశ్నలకు సుబ్బన్న సరిగ్గా చెప్పలేకపోయినా అతడు చెప్పింది వాళ్లకు కొంత తెలిసింది.

ఎవరో రాత్రి పన్నెండు గంటలకు గేటు దూకి లోపలికి వచ్చి డ్రైనేజి గొట్టం పట్టుకుని పైకి ఎక్కటానికి ప్రయత్నిస్తుండగా అలికిడి విని, సుబ్బన్న జామచెట్టు దగ్గరున్న గునపంతో దానిని పగలగొట్టాడనీ జాయింటు ఊడిపోగానే అతడు కిందపడి చేతిలో ఉన్న కర్రతో సుబ్బన్నను చావ బాదాడనీ గ్రహించారు. తరువాత ఆ లైనులో మరో రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయని తెలిసి పోలీసులు వెళ్లిపోయారు.

ప్రాణానికి తెగించి సుబ్బన్న చేసిన పనికి నరసింహం విఠల్ ఎంత సంతోషించారో అతడు పడుతున్న బాధకంత విచారపడ్డారు. తులసి చెప్పిన మీదట నరసింహం కారులో సుబ్బన్నను తీసుకుని హాస్పిటల్‌కు వెళ్లి ఒక ఇంజక్షను ఇప్పించి కట్లు కట్టించి తీసుకువచ్చాడు. సుబ్బన్నను వాళ్లు వారం రోజులపాటు

పని చెయ్యనివ్వలేదు. ఇంటి పనులు సంతోషంతో చేసుకుని సుబ్బన్నకు కావలసిన అన్ని ఉపచారాలు చేస్తున్నారు అందరూ కలిసి

నరసింహం విఠల్ పొద్దునా సాయంత్రం అతడి దగ్గరికి వెళ్లి ఎలా ఉందో అడిగి వస్తున్నారు. అతడికి మంచమొకటి కొనాలని ప్రయత్నించారు. కాని-అతడు తాను ఎక్కలేనని చెప్పాడు.

ఇప్పుడు సుబ్బన్నపట్ల ఆ రెండిళ్లలోనూ జాలీ, అభిమానమూ అంతు లేకుండా పుట్టుకొచ్చాయి.

రోజులు గడుస్తున్నకొద్దీ సుబ్బన్న వాళ్లకొక ఆత్మీయుడయి మరింత సన్నిహితుడిలా మెలగుతున్నాడు.

విఠల్ నరసింహం ఇంటికి రాగానే "ఏమిటోయ్ సుబ్బన్నా కబుర్లు?" అంటూ లోపల అడుగు పెడతారు

ఇలా నెలరోజులయినా గడవకముందే ఒకనాడు మధ్యాహ్నంవేళ నల్లగా లావుగా ఉన్న ఆడ మనిషి సుడిగాలిలా గేటు తెరచుకుని అరటిచెట్ల దగ్గర అంట్లు తోముతున్న సుబ్బన్న దగ్గరకొచ్చి అరవటం మొదలుపెట్టింది.

"ఈడికెందుకు వచ్చినవ్" సుబ్బన్న ముఖం చిట్లించాడు.

"నిన్నిడుస్తననుకున్నవా?" గర్జించింది.

"నీ పోకడలన్నీ సయించి ఉరుకున్నా గదా?"

"నా పోకడలెందుకొచ్చినయ్? నీ వల్ల. ఆడోళ్లందరినీ చుట్టూ కూకుండబెట్టు కుని ఇకఇకలూ-పకపకలూ, ఎక్కడికెళ్లిన ఆడోళ్లు, నీకు బుద్ధి చెప్పటానికే నేను మొగోళ్లతో తిరిగిన. ఇంకరాలేదా బుద్ధి? ఛీఛీ ఇసుమంటి మొగోణ్ణి ఎక్కడ సూడలే."

"నేనేం జేసిన? నాలో తప్పేంది?" మెల్లగా అడుగుతున్నాడతడు.

"అదిగో. ఆ నవ్వే చెడ్డది. అదే ఆడోళ్లను నీ చుట్టూ చేరుస్తది. పిచ్చెక్కిస్తది. అట్ల నవ్వకుండ ఉండలేవు?" కొట్టటానికి చేయెత్తింది.

"నా నవ్వు తీరే అంత నేనేదయిన తప్పు చేస్తే అడుగు. అయినా నీవు రాముడెంట ఎళ్లినవ్ కదా?"

"ఎళ్లిన-రాముడెంట నీ మీద కసి తీర్చుకోటానికి కాని -"

"ఇంక ఈడు ఎందుకు బతికిండా అని చంపటానికి వచ్చినవా?"

"అవును. నా కసి నీవు చస్తేకాని పోదు. నీ నవ్వు ఈ జగంలో లేకుండా చెయ్యాల-నేను నిదరపోవాల" ఆ దగ్గరలో ఉన్న కట్టె తీసుకుని ఎత్తింది.

ఆమె చేతిలోని కట్టెను ఎవరో లాగేశారు. ఆమెను వెనక్కు పడేటట్టు తోశారు.

"తల్లీ. మీరెందుకొచ్చినరు తల్లీ ఈడికి? అది పోలేరమ్మ. దూరంగ జరగండి" నందినికి దణ్ణం పెట్టాడు సుబ్బన్న.

నందినిని ఆపాదమస్తకం కళ్లు పెద్దవి చేసుకుని చూసింది రంగివి.

"అఁ నీవు కూడ పడినవా ఆ నవ్వు మత్తులో? ఊఁ?" ఉరిమి చూసింది రంగి.

రంగి ఆవరణంలోకి వచ్చినప్పటి నుండీ వాళ్ల సంభాషణ విని కుతూహలం కొద్దీ బయటికి వచ్చిన నందిని ఇంక సహించలేకపోయింది.

రంగి చేచి ఒళ్లు దులుపుకుని కట్టె మళ్లీ ఎత్తింది.

నవ్వులోని మత్తు? నవ్వులోని మత్తు? తనకు ఇంతకాలం నుంచీ స్ఫురించనిది ఇదేనా? మత్తు? మత్తు?

మంగి ఎత్తిన కట్టె సుబ్బన్న తల మీద పడకుండా అడ్డగించిన నందిని తల మీద పడ్డది.

"తల్లీ-నా కోసం దెబ్బ తింటివా తల్లీ" రెండు చేతులతో కళ్లు మూసుకున్నాడు సుబ్బన్న.

ఈ అరుపులకు తులసి పరుగుపరుగున వచ్చింది. నందినిని నడిపించుకుంటూ లోపలికి తీసుకు వెళ్లింది. మంచమ్మీద పడుకోబెట్టి చల్లనీళ్లతో ముఖ

మంతా తుడిచింది. తల తడిమి చూసింది తడి తడిగా ఉన్న తలలో వెంట్రుకలు ఒత్తిగించి చూసింది. పెద్ద గాయము కాకపోయినా చర్మం చిట్లి రక్తం స్రవిస్తున్నది. బట్టతో తుడిచి మందు చల్లి దాని మీద దూదిపెట్టింది.

రక్తం చూడగానే తులసికి ఎక్కడలేని ఆవేశం వచ్చింది. ఒక్క అంగలో జేమచెట్టు దగ్గరకెళ్లింది

వాళ్లిద్దరూ ఇంకా అక్కడ ఘర్షణ పడుతునే ఉన్నారు.

"ఏమిటి సుబ్బన్నా ఈ అల్లరి?" అరిచింది.

"ఈ నచ్చినోడి సంగతి నేను చెబుతా- ఇనుకో. ఈడినుంచే ఒకూళ్లో మా గుంపులో కొట్లాడలు వచ్చి పిల్లను తీసుకుని తల్లీతండ్రీ ఇడి పోయినరు. ఇంకో ఊళ్ళో మేడగలోరు పిల్లకు పెళ్లిచేసి దూరంగా పంపించినరు. నా మెడలో పుస్తె గట్టినా బుద్ధి మారలేదీడికి" సుబ్బన్న వైపు తిరిగి మెటికలు విరిచింది.

"ఏం సుబ్బన్నా. రంగి చెప్పేదంతా నిజమా?"

తల అడ్డంగా తిప్పుతూ తలకు దోసిలి కట్టాడు.

రంగి సుబ్బన్నను చూస్తూ పళ్లు కొరుకుతున్నది. నిప్పులు కురిపిస్తున్నాయామె కళ్లు.

తడబడుతున్న కాళ్ళతో లోపలికి నడిచింది తులసి సుబ్బన్నను పనిలో ఉంచటమా తీయటమా అనుకుంటూ.

ఫోను ఎత్తి "మీరు తొందరగా ఇంటికి రండి. ఘోరం జరిగిపోయింది" అంటూ నరసింహాన్ని పిలిచింది.

(ఆలిండియా రేడియో)